క్లుప్తంగా

వినతిపత్రం అందజేత



ములుగు: జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ దివాకర్ టీఎస్‌ను ట్రైబల్ వర్కింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్ నాయకులు శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ జిల్లా నాయకుడు బానోత వెంకన్న మాట్లాడుతూ.. జిల్లా అక్రిడేషన్ కమిటీలో ట్రైబల్ వర్కింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్ సభ్యులకు అవకాశం కల్పించాలని కోరారు. గిరిజన జర్నలిస్టులకు ప్రభుత్వం డిసెంబర్ నెలలో నిర్వహించనున్న శిక్షణ తరగతులలో వర్కింగ్ జర్నలిస్టులు అందరికి అవకాశం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు సునీల్, కార్యదర్శి శరత్, వర్కింగ్ ప్రెసిడెంట్ సుధాకర్, ఉపాధ్యక్షుడు సునీల్ తదితరులు ఉన్నారు.

రేపు ఉచిత మెగా వైద్యశిబిరం

ఏటూరునాగారం: మండలంలోని శంకరాజపల్లి గ్రామంలో ఈనెల 24న మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు రోటరి క్లబ్ సభ్యులు, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కాలకుమ్రి లక్ష్మీనర్సింహారావు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. హనుమకొండకు చెందిన రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో సమస్యాత్మక జ్వర పీడిత ప్రాంతమైన శంకరాజపల్లి గ్రామాన్ని రోటరీ క్లబ్ జనరల్ సెక్రెటరీ కాకులమర్రి ప్రవీణ్ కుమార్ దృష్టికి తీసుకెళ్లామన్నారు. దీంతో ఆ క్లబ్ ఆధ్వర్యంలో 30 మంది వైద్యులతో మెగా వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయనున్నారని తెలిపారు. ప్రతి రోగికి ఉచితంగా మందులను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ప్రదీప్‌కుమార్, రఘు, నర్సయ్య పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం పరిశీలన



గోవిందరావుపేట: మండలంలోని చల్వాయి గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పస్రా ఎస్సై కమలాకర్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు దళారులను నమ్మి మోసపోవద్దన్నారు. ఏదైనా సమస్య ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని అన్నారు.

జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక

మల్లూర్: జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మండలంలోని తాడిచర్ల జిల్లాపరిషత్ పాఠశాలలో నిర్వహించిన మండల స్థాయి చెకుముకి పోటీల్లో ఎడ్లపల్లి మోడల్ పాఠశాలకు చెందిన విద్యార్థులు జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్స్‌పాల్ పుర్షచందర్‌రావు శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. పదవ తరగతికి చెందిన సీహెచ్ వైష్ణవి, 9వ తరగతికి చెందిన మానస్వీని, 8వ తరగతికి చెందిన వీ హాని జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పేర్కొన్నారు. ఈనెల 28న నిర్వహించనున్న జిల్లా స్థాయి పోటీల్లో వారు పాల్గొననున్నట్లు తెలిపారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

ములుగు రూరల్: ములుగు మండలంలోని జాకారం వద్ద జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఉయ్యాల బాబు (50)కు ఇటీవల గాయాలయ్యాయి. కాగా, చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

నిరుపయోగంగా మరుగుదొడ్లు

- ఇబ్బంది పడుతున్న విద్యార్థినులు
- పట్టించుకోని అధికారులు



నిరుపయోగంగా ఉన్న మరుగుదొడ్లు

కాటారం: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో నిర్మించిన టాయిలెట్స్ నిరుపయోగంగా ఉన్నాయి. ప్రభుత్వ ఐటీఐ కళాశాల కొన్ని సంవత్సరాలుగా స్థానిక జిల్లా పరిషత్ పాఠశాల ఆవరణలోని భవన సముదాయంలో కొనసాగుతోంది. మరుగుదొడ్లు లేకపోవడంతో కళాశాల విద్యార్థినులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత ఏడాది విద్యార్థినుల ఆత్మగౌరవ సమస్యను వెలుగులోకి తీసుకురాగా అప్పటి కలెక్టర్ భవేశ్ మిశ్రా మరుగుదొడ్ల నిర్మాణం కోసం రూ.5 లక్షలు నిధులు కేటాయించారు. పంచాయతీరాజ్ విభాగం అధికారులు నిర్మాణ పనులను ఓ కాంట్రాక్టర్‌కు అప్పగించగా టాయిలెట్స్ నిర్మాణం పూర్తి చేశారు. కానీ బోరు, నీటి సౌకర్యం, పైప్‌లైన్ ఏర్పాటు చేయకపోవడంతో అవి వినియోగంలోకి రావడం లేదు. బిల్లు చెల్లింపులో జాప్యం కారణంగా మిగిలిన పనులు చేయడం లేదని కాంట్రాక్టర్ తెలిపినట్లు ఐటీఐ సిబ్బంది తెలుపుతున్నారు. దీంతో విద్యార్థినులు, కళాశాల మహిళా సిబ్బంది తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. టాయిలెట్స్ అందుబాటులో లేని కారణంగా విద్యార్థినులు కళాశాలకు రాలేని దుస్థితి నెలకొంది. ఇప్పటికైన ఉన్నతాధికారులు స్పందించి టాయిలెట్స్ వినియోగంలోకి తెచ్చేలా చర్యలు తీసుకొని విద్యార్థుల ఇబ్బందులు తొలగించాలని పలువురు కోరుతున్నారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు



హోమం నిర్వహిస్తున్న శివ స్వాములు

వెంకటాపురం(కె): మండల కేంద్రంలోని శ్రీ ఉమా రామాలింగేశ్వరస్వామి ఆలయంలో వైభవంగా అష్టాదశ లక్ష బిల్వార్చన (మారేడు పత్రులతో) పూజా కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ఉదయం 9 గంటలకు లక్ష్మీగణపతిపూజ 10 గంటలకు ఏకాదశ పూర్వక రుద్రాభిషేకం, మధ్యాహ్నం 2 గంటలకు స్వామివారికి మారేడు పత్రులతో విశేషమైన లక్ష భిల్వార్చన పూజ, సాయంత్రం 5 గంటలకు రుద్ర హోమం, ఆరు గంటలకు అమ్మవారికి సహస్రనామ కుంకుమార్చన పూజ, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ పూజలను తిలకించేమదుకు భక్తులు ఉదయం నుండె ఆలయం కు చేరుకోవటంతో ఆలయ ప్రాగణం కోలాహలంగా మారింది.సూదురా ప్రాంతాలనుండి వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఆలయ కమిటీ అన్ని ఏర్పాట్లను చేశారు.

బీమాను సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న ఎస్ఓ సురేశ్‌బాబు

ఏటూరునాగారం: ప్రధాన మంత్రి జీవన్ జ్యోతి బీమా పథకాన్ని 18 నుంచి 70 ఏళ్ల లోపు ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఐటీడీఏ స్టాటిస్టికల్ అధికారి సురేష్‌బాబు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని పోస్టుమెట్రిక్ హాస్టల్‌లో బీమా ప్రత్యేక క్యాంపును బ్యాంక్ అధికారులతో కలిసి ఐటీడీఏ అధికారులు నిర్వహించారు. 83 మంది ఖాతాదారులు హాజరై బీమా చేయించుకున్నట్లు సురేశ్ తెలిపారు. అలాగే ఎల్‌డీఎం జయప్రకాశ్ మాట్లాడుతూ.. ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన పీఎంఎస్‌బీవై పథకం కింద దరఖాస్తు చేసుకోవాలని కోరారు. పీఎంఎస్‌బీవై వార్షిక ప్రీమియం రూ.20లు చెల్లిస్తే రూ.రెండు లక్షల ప్రమాద బీమా ఉంటుందన్నారు. రూ.436లు చెల్లిస్తే రూ.2లక్షల ప్రమాద బీమా, ఇతర బెనిఫిట్స్ వస్తాయన్నారు. ఆసక్తి గల వ్యక్తులు 2025 జనవరి 15 వరకు బీమా చేయించుకోవచ్చు అని తెలిపారు. ఈ కార్యక్రమంలో జేడీఎం కొండల్‌రావు, కెనరా బ్యాంక్ మేనేజర్ హరిప్రసాద్, ఎస్‌బీఐ మేనేజర్ అనిల్, భాస్కర్, మాదురి, వెంకటేష్ పాలొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రత తప్పనిసరి

- చుంచుపల్లి వైద్యాధికారి యమున



అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి యమున

మంగపేట: వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని చుంచుపల్లి వైద్యాధికారి యమున అన్నారు. మండలంలోని చుంచుపల్లి పీహెచ్‌సీ పరిధిలోని సబ్‌సెంటర్, గ్రామ పంచాయతీలో యాంటీ మైక్రోబియల్ రెసిస్టెన్స్ క్యాంపయిన్ ప్రచార కార్యక్రమంలో భాగంగా ప్రజలకు పరిశుభ్రత, యాంటీ బయాటిక్స్ వాడకంపై అవగాహన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. చేతులను తరచు శుభ్రంగా కడుక్కోవాలని తద్వారా ఇన్ఫెక్షన్స్ సోకకుండా కాపాడుకోవచ్చని తెలిపారు. ఇన్ఫెక్షన్స్ సోకకుండా యాంటీ బయాటిక్స్ వాడకం వలన కలిగే నష్టాలను వివరించారు. ఈ కార్యక్రమంలో పీహెచ్ఎన్ శైలజ, ఏఎన్ఎం, ఆశ కార్యకర్తలు, గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

కరపత్రం ఆవిష్కరణ



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

మంగపేట: మండల కేంద్రంలో ఈనెల 26న నిర్వహించే డాక్టర్ బీంరావ్ అంబేడ్కర్ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమ కరపత్రాన్ని అంబేడ్కర్ యవజన సంఘం మండల కమిటీ, ఆదివాసీ గిరిజన సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆదివాసీ గిరిజన సంఘాల నేత గొప్ప సమ్మారావు మాట్లాడుతూ.. అంబేడ్కర్ రచించిన రాజ్యాంగం ద్వారనే ఆదివాసీలకు, దళితులకే కాకుండా సబ్బండ వర్గాలకు హక్కులు, రిజర్వేషన్లు కల్పించబడ్డాయన్నారు. విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమానికి పంచాయతీరాజ్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క హాజరవుతున్నారని కార్యక్రమానికి అన్ని వర్గాల ప్రజలు, అంబేడ్కర్ వాదులు, అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అంబేడ్కర్ యువజన సంఘం సీనియర్ నాయకులు పగిడిపల్లి వెంటకేశ్వర్లు, విగ్రహదాత చెల్లుపల్లి వెంకటేశ్వర్లు, విగ్రహ కమిటీ చైర్మన్ ఎంపెల్లి సమ్మయ్య, హరికృష్ణ, అంజయ్య, కబ్బాకశ్రావణ్‌కుమార్, అయ్యోరి యానయ్య, జయరాంరెడ్డి, తదితర నాయకులు పాల్గొన్నారు.

చక్రవర్తిపల్లెలో పశువైద్య శిబిరం



మందులను రైతులకు అందిస్తున్న మహతి

వెంకటాపురం(ఎం): మండలంలోని చక్రవర్తిపల్లెలో పశువుల ఉచిత గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరాన్ని శుక్రవారం నిర్వహించినట్లు లక్ష్మీదేవిపేట పశు వైద్యాధికారి మహితి తెలిపారు. ఈ సందర్భంగా 99 పశువులకు గర్భకోశ వ్యాధుల చికిత్స, 45 పశువులకు నట్టల నివారణ మందు, 124 పశువులకు గర్భస్థ వ్యాధి నివారణ మందులను పశు యాజమానులకు ఉచితంగా పంపిణీ చేసినట్లు ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వెటర్నరీ డాక్టర్ జగపతిరావు, సూపర్‌వైజర్ అయిలుమల్లు, గోపాలమిత్రలు రాజేందర్, దామోదర్, శ్రీనివాస్, అలేషా, సిబ్బంది వేణు, తేజవర్మ ఉన్నారు.

మహాసభలను విజయవంతం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

వెంకటాపురం(కె): ఏటూరునాగారంలో డిసెంబర్ 6, 7 తేదీల్లో నిర్వహించే సీపీఎం జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు సాంబిరెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో సీపీఎం ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహాసభలో ప్రజల సమస్యల పరిష్కారానికి చేయాల్సిన పోరాటాలు, పార్టీ బలోపేతానికి కార్యచరణ రూపొందించుకోవటం జరుగుతుందని అన్నారు. ఈ సమావేశంలో సీపీఎం మండల కార్యదర్శి గ్యానం వాసు, నాయకులు కట్ల చారి, కుమ్మరి శ్రీను, వంకా రాములు, ఆదినారాయణ, మాణిక్యం, పరసాద్, బాబురావు తదితరులు ఉన్నారు.

కేంద్ర ప్రభుత్వ విధానాలను ఎండగట్టాలి

- సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు వెంకటేశ్



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్

భూపాలపల్లి అర్బన్: కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు వెంకటేశ్ పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని కృష్ణకాలనీ సింగరేణి కమిటీ హాల్‌లో శుక్రవారం రెండో రోజు నిర్వహించిన సీపీఎం మూడోవ మహాసభల అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అనేక విధ్వంసాలకు పాల్పడుతుందన్నారు. ప్రజలకు ఉపయోగపడే పలు కంపెనీలను ప్రైవేట్ పరం చేస్తుందన్నారు. సింగరేణి ప్రాంతంలో ఉన్న బొగ్గు బ్లాక్‌లను సింగరేణికి అప్పగించాలని డిమాండ్‌చేశారు. జిల్లాకు రైల్వే మార్గాన్ని వెంటనే ఏర్పాటు చేయాలని, సింగరేణి జెన్కో ఆధారిత పరిశ్రమలైన బొగ్గు శుద్ధి, ఎరువుల, సిమెంటు కర్మాగారాలు ఏర్పాటు చేసి నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరం గడిచిన సందర్భంగా సంబురాలు నిర్వహిస్తున్నారని ప్రజా సంక్షేమానికి ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి బందు సాయిలు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కంపేటి రాజయ్య, చెన్నూరు రమేష్, పోలం రాజేందర్, వి రాజయ్య, గుర్రం దేవేందర్, సంఘం ప్రీతి, ఆతుకూరి శ్రీకాంత్, వందమంది మహాసభ ప్రతినిధులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలి

- స్వయంకృషి సేవా సంస్థ ఫౌండర్ సతీశ్



స్టడీ మెటీరియల్ అందజేస్తున్న సభ్యులు

కాటారం: విద్యార్థులు పట్టుదలతో చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని స్వయంకృషి సేవా సంస్థ ఫౌండర్ కొట్టె సతీశ్ అన్నారు. మండలంలోని దేవరాంపల్లి జెడ్పీహెచ్ఎస్ ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు స్వయంకృషి సేవా సంస్థ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకుడు గద్దె సమ్మిరెడ్డి సహకారంతో స్టడి మెటీరియల్, పరీక్ష ప్యాడ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కొట్టె సతీశ్, గద్దె సమ్మిరెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించాలని తెలిపారు. వార్షిక పరీక్షలు సమీపిస్తున్న సమయంలో ప్రిపరేషన్‌కు ఉపయోగపడేలా స్టడిమెటిరియల్ అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రతి విద్యార్థి ఉత్తమ ఫలితాలు సాధించి పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని పేర్కొన్నారు. స్టడి మెటీరియల్, పరీక్ష ప్యాడ్లు అందజేసిన సేవా సంస్థ ఫౌండర్ కొట్టె సతీశ్‌కు పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపి సన్మానించారు. రమేశ్‌రెడ్డి, కామిడి వెంకట్‌రెడ్డి, కామిడి శ్రీను, అనంతుల శ్రీను, మిర్యాల శ్రీను, రాజిరెడ్డి, బుచ్చయ్య, దోమ భాస్కర్, గద్దె దేవేందర్, స్వయం కృషి సభ్యులు సుమన్, అఖిల్, సాయి, రవి, వేణు పాల్గొన్నారు.

‘మాదిగల ఆత్మగౌరవాన్ని కించపర్చారు’



మాట్లాడుతున్న నాయకులు

మంగపేట: మండల కేంద్రంలో అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసే విషయంలో అంబేడ్కర్ యువజన సంఘాల నాయకులు మాదిగల ఆత్మగౌరవాన్ని దెబ్బ తీశారని మాదిగ సామాజిక సంఘ నాయకులు ఆరోపించారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసే విషయంలో డబ్బులు ఇచ్చిన వారిపేర్లను మాత్రమే శిలాఫలకం మీద, అంబేడ్కర్ ఉత్సవాల్లో కలుపుకుంటామని అంబేడ్కర్ యువజన సంఘంలో ఉన్న సీనియర్ నాయకులైన మాదిగలను అవమాన పరిచారని ఆరోపించారు. త్వరలోనే అంబేడ్కర్ భవనం వద్ద మాదిగ సామాజికవర్గం ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు నిర్ణయం తీసుకున్నామన్నారు. కార్యక్రమంలో మాదిగ సామాజిక వర్గం నాయకులు ఎంపెల్లి మల్లేశ్, పరికి శెను, ఎల్‌పీ రవి, చంద్రావు, సురేశ్, హరీష్, నర్సింహారావు, గాజర్ల రాజుతో పాటు తదితరులు పాల్గొన్నారు.

తప్పులు లేకుండా నమోదు చేయాలి

- ఎంపీడీఓ వెంకటేశ్వర్లు



మాట్లాడుతున్న ఎంపీడీఓ వెంకటేశ్వర్లు

కాళేశ్వరం: సామాజిక, ఆర్థిక, విద్యా, రాజకీయ, కుల గణన సర్వేను ఆపరేటర్లు తప్పులు లేకుండా డాటా నమోదు చేయాలని మహదేవపూర్ ఎంపీడీఓ వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని రైతువేదిక వద్ద మహదేవపూర్, పలిమెల మండలాల కంప్యూటర్ ఆపరేటర్లకు, ఎన్యుమరేటర్, ఆపరేటర్లకు భూపాలపల్లి ఎంపీఎస్ఓ శివకృష్ణ ద్వారా ఆన్‌లైన్ డాటా ఎంట్రీపై శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. ప్రతి ఒక్క ఆపరేటర్ వారికి కేటాయించిన డాటా ఎంట్రీ సెంటర్లో ప్రతిరోజు సుమారుగా 25 సర్వే ఫారంలు నమోదు చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. డాటా నమోదులో ఎలాంటి తప్పులు లేకుండా చేయాలన్నారు. తహసీల్దార్ ప్రహ్లాద్ రాథోడ్, ఎంపీఓ ప్రసాద్, పలిమెల ఎంపీడీఓ ఎస్.శ్రీనివాస్, ఎన్యుమరేటర్లు ఉన్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటుకు విరాళం

కాటారం: పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న సీసీ కెమెరాల కోసం వ్యాపారులు, నాయకులు, యువకులు, ప్రజలు తమ వంతు సహకారం అందిస్తున్నారు. ఇందులో భాగంగా మండలంలోని బయ్యారం సమీపంలోని శ్రీ లక్ష్మి సూర్య ఫిల్లింగ్ స్టేషన్ యజమాన్యం సీసీ కెమెరాల కోసం రూ.10 వేలు విరాళంగా ప్రకటించారు. పెట్రోల్ పంపు యజమాని మంత్రి రాజబాబు విరాళం చెక్కును స్థానిక ఎస్సై అభినవ్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. సీసీ కెమెరాల ఏర్పాటు కోసం విరాళాలు ఇవ్వడానికి ముందుకు రావడం అభినందనీయం అన్నారు.

మంచు దుప్పటి



వెంకటాపురం(కె) మండల కేంద్రంలోని చొక్కాల సమీపంలో శుక్రవారం తెల్లవారు జామున మంచు కురిసింది. శివాలయం రోడ్డు, చొక్కాల రోడ్డులో మంచు దుప్పటిలా అలుముకుంది.

\- వెంకటాపురం(కె)



బాధిత కుటుంబాలకు అండగా బీఆర్ఎస్



ఎస్ఎస్ తాడ్వాయి: పరామర్శిస్తున్న నాయకులు



మంగపేట: నివాళులర్పిస్తున్న నాగజ్యోతి

- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్ బాబు

ఎస్ఎస్‌తాడ్వాయి: బాధిత కుటుంబాలకు బీఆర్ఎస్ పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుందని పార్టీ జిల్లా అధ్యక్షుడు కాకుల మర్రి లక్ష్మణ్ బాబు అన్నారు. మండలంలోని నార్లాపూర్ గ్రామానికి చెందిన పార్టీ మండల సీనియర్ నాయకుడు ఎనగంటి భద్రయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో శుక్రవారం ఆయన కుటుంబాన్ని మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ బడే నాగజ్యోతితో కలిసి ఆయన పరామర్శించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ పోరిక గోవింద్ నాయక్, మేడారం జాతర మాజీ చైర్మన్లు కాక లింగయ్య, రేగ నర్సయ్య, జిల్లా యువ నాయకుడు భూక్య జంపన్న, మండల అధ్యక్షుడు దండుగుల మల్లయ్య, మాజీ జెడ్పీటీసీ రామసహాయం శ్రీనివాస్ రెడ్డి, మాజీ సర్పంచులు ఉన్నారు.

మంగపేట: మండలంలోని కమలాపురానికి చెందిన తుక్కాని భాగ్యమ్మ ఇటీవల మృతి చెందింది. దీంతో బాధిత కుటుంబాన్ని మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ బడే నాగజ్యోతి, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్‌బాబు శుక్రవారం పరామర్శించారు. అలాగే రాజేంద్రప్రసాద్ ప్రథమ వర్ధంతికి హాజరై ఆయన చిత్రపటం వద్ద నివాళులర్పించారు. అనంతరం ఇటీవల తలకు శస్త్ర చికిత్స చేయించుకుని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు సత్యనారాయణను పరామర్శించారు. ఏటూరునాగారం మండల అధ్యక్షుడు సునీల్, మాజీ సర్పంచ్ రాంమ్మూర్తి, పీఏసీఎస్ డైరెక్టర్ రామయ్య, నర్సయ్య, తిరుపతి, సోషల్ మీడియా ఇన్‌చార్జ్ శ్రీహరి, మేడారం ట్రస్టు బోర్డు మాజీ డైరెక్టర్ చిలకమర్రి రాజేందర్ పాల్గొన్నారు.

ములుగు రూరల్: మండలంలోని పాట్లాపూర్, చింతకుంట, జంగాలపల్లి గ్రామాలకు చెందిన కాడబోయిన అనూష, ఎంచులక్ష్మి, రాజ్‌కుమార్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో బాధిత కుటుంబ సభ్యులను బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మణ్‌రావు పరామర్శించారు. గోవింద్ నాయక్, శ్రీనివాస్, ప్రదీప్‌రావు, మురళి, మహేష్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలి



మాట్లాడుతున్న విజయ్

వెంకటాపురం(కె): త్వరలో రానున్న స్థానిక సంస్థల ఎన్నికలకు కార్యకర్తలు, నాయకులు సిద్ధం కావాలని బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి సాధనపల్లి విజయ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో బీజేపీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయలేదని అన్నారు. కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగడుతూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని పంచాయతీల్లో పార్టీ అభ్యర్థులు విజయానికి కృషి చేయాలని అన్నారు.